క్లుప్తంగా

బస్సుల కోసం నిరీక్షణ

నర్సాపూర్: సకాలంలో బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్– పటాన్‌చెరు మార్గంలో సాయంత్రం వేళలో బస్సులు సకాలంలో రావడం లేదని, దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని చెబుతున్నారు. సమాచారం కోసం కంట్రోలర్‌ను అడిగినా సరైన సమాధానం రావడం లేదంటున్నారు. కాగా నర్సాపూర్–బాలానగర్ మార్గంలోనూ స్థానిక డిపోతో పాటు మెదక్, జీడిమెట్ల డిపోలు ఆర్డినరీ బస్సులు నడుపుతున్నప్పటికీ సమయపాలన పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి ఒకేసారి రెండు మూడు బస్సులు వస్తున్నాయని, ఆ తర్వాత గంట సేపు నిరీక్షించాల్సి వస్తోందంటున్నారు. బస్సుల సంఖ్య పెంచడంతో పాటు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయమై నర్సాపూర్ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి లక్ష్మయ్యను వివరణ కోరగా పటాన్‌చెరు మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరగడంతో పాటు పలు చోట్ల రోడ్డు సరిగా లేకపోవడంతో ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపారు.

ముమ్మరంగా దరఖాస్తుల నమోదు

నర్సాపూర్: అభయ హస్తం దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలో 52,646 దరఖాస్తులు వచ్చాయని, అందులో 4,409 నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో, 11,433 ఆయా గ్రామాల నుంచి వచ్చాయన్నారు. శివ్వంపేట మండలం నుంచి 8,623, కౌడిపల్లి మండలం నుంచి 9,012, కొల్చారం మండలం నుంచి 10,361, చిలిపిచెడ్ మండలం నుంచి 5,947 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 70 శాతం దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్ చేశామని తెలిపారు. మిగిలిన వివరాలు గడువులోగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా అభయ హస్తం దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డులు కావాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని 7,420 దరఖాస్తులు అందాయని, వాటిని ఆయా శాఖల అధికారులకు పంపినట్లు ఆర్డీఓ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధి పాతూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తిరుపతి తెలిపారు. మండల పరిధిలోని పాతూరు, శమ్నాపూర్, గంగాపూర్, కొచ్చెరుతండా పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

శ్రీవరి నాట్లపై అవగాహన



శ్రీ పద్ధతిలో వరి నాట్లు వేయిస్తున్న సెహగల్ ఫౌండేషన్ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గురువారం శ్రీవరి నాట్లపై రైతులకు సెహగల్ ఫౌండేషన్ సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి మారుతి శ్రీ పద్ధతిలో నాట్లతో కలిగే లాభాలు వివరించారు. మొక్కల మధ్య సరైన దూరం ఉంటే మొక్కలకు గాలి, వెలుతురు అందుతుందన్నారు. దిగుబడి కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ రుక్కమ్మ

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన రామె నర్సింహులు ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించిన 7వ వార్డు కౌన్సిలర్ రుక్కమ్మ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి సాయం అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

13న ముగ్గుల పోటీలు

నర్సాపూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 13వ తేదీన పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు ప్రసాద్ గురువారం తెలిపారు. పట్టణంలోని 10, 11 వార్డుల పరిధిలో పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న మహిళలు పాల్గొనాలని కోరారు. విజేతలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి

ప్రభుత్వం పాఠశాలలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బాలికలకు ముగ్గులు, బాలురకు పతంగుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ, సంస్కృతి సంప్రదాయాలను తెలియజేశారు. సంక్రాంతి ముందస్తు సంబురాలతో పాఠశాలలు పండుగ వాతావరణం సంతరించుకున్నాయి. కొన్ని చోట్ల విద్యార్థులు హరిదాసు వేషధారణలో అలరించారు. వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో అధికారులు పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి పొంగలి నైవేద్యం తయారు చేశారు.



వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మండల నోడల్ ఆఫీసర్ నీరజ



సోమక్కపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేస్తున్న ముగ్గులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



వెల్దుర్తిలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న బాలికలు



సదాశివపల్లిలో ముగ్గును తిలకిస్తున్న సర్పంచ్ శోభ తదితరులు



చల్మెడ ప్రాథమిక పాఠశాలలో ముగ్గులు వేస్తున్న బాలికలు



పెద్దశంకరంపేటలో కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఉద్యోగుల సేవలకు గుర్తింపు

నర్సాపూర్ రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే సేవలకు గుర్తింపు చిరకాలం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షులు గుండం మోహన్ రెడ్డి అన్నారు. నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇటీవల బదిలీ అయిన శ్రీశైలం వీడ్కోలు సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బదిలీ అయినా, పదవీ విరమణ చేసినా వారి సేవలను ప్రజలు గుర్తు చేసుకుంటారన్నారు. అనంతరం శ్రీశైలం మాట్లాడుతూ కాగజ్ మద్దూరు పాఠశాల ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తారన్నారు. సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాజియా తబస్సుమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌పై అవగాహన

నర్సాపూర్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాల 2లో గురువారం గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం సభ్యులు శ్రీనివాస్, స్వరూప పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాలు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి

మెదక్ మున్సిపాలిటీ: ఆరు నెలలుగా వేతనాలు రాక అనేక అవస్థలు పడుతున్నామని మెదక్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీఆర్పీలు వాపోయారు. గురువారం మెదక్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నామన్నారు. ప్రభుత్వం పెండింగ్ వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెట్ల నరికివేతపై కేసు.. జరిమానా

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ అనుమతి లేకుండా అడవిలో చెట్లు నరికినందుకు వాల్టా, ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం కేసునమోదు చేయడంతోపాటు జరిమానా విధించినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి కరీమొద్దీన్ గురువారం తెలిపారు. మండలంలోని మహ్మద్ నగర్ బీట్ కంపార్ట్‌మెంట్ 303లో నాగ్సాన్‌పల్లి గ్రామశివారులోని బేసిక్ బ్రీడర్స్ ఫౌల్ట్రీ ఫాం యజమానురాలు లక్ష్మి తన భూమికి ఆనుకుని ఉన్న 20 ఎకరాల అటవీభూమిలోని చెట్లు నరికి రాతి కడీలు పాతినట్లు చెప్పారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డీఎఫ్ఓ విచారణ జరిపి ఆమెపై వాల్టా, ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం కేసునమోదు చేయడమే కాకుండా రూ 2,33,230 జరిమాన విధించినట్లు తెలిపారు. త్వరలో బేసిక్ బ్రీడర్ ఫౌల్ట్రీ ఫాం భూమిని అటవీ, రెవెన్యూ శాఖలు ఉమ్మడి సర్వే చేస్తారన్నారు.

బగలాముఖి ఆలయంలో విశేష పూజలు



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో బగలాముఖీ ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. అమావాస్య సందర్భంగా బగలాముఖీ ఉపాసకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నీలిమ, హన్మంత్‌రావు దంపతులు అన్నదానం నిర్వహించారు. పటాన్‌చెరువు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ పబ్బ స్వరూప, రమేష్‌గుప్తా, ఉప సర్పంచ్ పద్మ, పలువురు పాల్గొన్నారు.

గ్యార్మీ ఉత్సవాలు



గ్యార్మీ ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో గురువారం ముస్లింలు గ్యార్మీ పండుగను జరుపుకున్నారు. హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏటా మక్కరాజీపేటలో గ్యార్మీ ఉత్సవాన్ని నిర్వహించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు విశ్వేశ్వర్, మహ్మద్ అలీ, బాబర్ ఖాద్రీ, అక్తర్, షకీల్, తాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ స్వరూపరెడ్డి తనిఖీ సమయంలో సరుకులు పక్కదారి పట్టడాన్ని గమనించారు. పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ మాసాయిపేట క్లస్టర్ సూపర్ వైజర్ సుజాత గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాన్ని తాను తనిఖీ చేసినప్పుడు ప్రభుత్వం సరఫరా చేసిన వాటికి బదులు ఎనిమిది కిలోల కందిపప్పు, కోడిగుడ్లు స్థానికంగా కొనుగోలు చేసి ఉంచినట్లు గుర్తించానన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.

పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలి

నర్సాపూర్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హితవు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, విధులనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పిండి వంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నోట్‌బుక్స్, పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో జడ్జి కె.అనిత, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, న్యాయవాది స్వరూప, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులు, సిబ్బందితో జడ్జి అనిత

ఓటరు జాబితాలో తప్పులు సవరించండి

తహసీల్దార్ కృష్ణ

టేక్మాల్(మెదక్): ఓటరు జాబితాలో తప్పులు సవరించాలని తహసీల్దార్ కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రమైన టేక్మాల్‌లో ఓటరు జాబితాపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా వేశామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు ఈనెల 22వ తేదీ వరకు అవకాశముందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో ఓటరు జాబితా సవరణపై సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిశ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



టేక్మాల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ఎదగాలని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ప్రబంధకర్త కొట్టూరి కాశీనాథ్ అన్నారు. గురువారం మెదక్‌లోకి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి అంజలిఘటించారు. అనంతరం కాశీనా థ్ మాట్లాడుతూ వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చక్కని ఉపన్యాసాలు, పాటల తో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గులు, పతంగుల తయారీ పోటీలు నిర్వహించారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



శివ్వంపేటలో డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీ గురించి వివరిస్తున్న అధికారి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. శివ్వంపేట, లచ్చిరెడ్డిగూడం తదితర గ్రామాల్లో నిర్వహించిన యాత్రలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం జీవనజ్యోతి, సురక్ష భీమా, వ్యవసాయ సాగులో అగ్రిగోన్ పిచికారీ, ఆయుష్మాన్ భారత్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి, జప్తిశివనూర్ గ్రామాలలో అధికారులు గురువారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నోడల్ అధికారి, ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ అశోక్ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ ఆఫీసర్ మోహన్ రావు, ఏఈఓ దివ్య, ఏఎన్ఎం పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండలంలోని ప్రగతి ధర్మారంలో వ్యవసాయ అధికారులు రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. నిర్ణీత మోతాదులో ఎరువుల వాడకం, నానో యూరియా, నానో డీఏపీ వాడితే కలిగే లాభాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ వివరించారు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగుల మందుల పిచికారీ చేసే విధానం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

బీజేపీ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ, అసైన్‌మెంటు భూములు కాపాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ సురేష్, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ గురువారం ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. పట్టణంలోని 731 సర్వే నంబరుతోపాటు పలు సర్వేనంబర్లలోని ప్రభుత్వ, అసైన్‌మెంటు భూములను తమ వెంచర్‌లోకలిపి ప్లాట్లు చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ, అసైన్‌మెంటు భూములు అన్యాక్రాంతం అవుతున్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, మండల తహసీల్దార్ కమలాద్రి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



నర్సాపూర్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన కాంట్రాక్టు లెక్చరర్లు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెక్చరర్లు

మెదక్ కలెక్టరేట్: ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావుకు చెప్పి వాపోయారు. మెదక్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను గురువారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కలిసి తమ సమస్యలు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన ఉన్నత విద్యా కమిషనర్ బుర్ర వెంకటేశంకు ఫోన్ చేసి మాట్లాడారు. లెక్చరర్ల వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్స్ అధ్యక్షుడు వినోద్ కుమార్, జిల్లా నాయకులు పశుపతి శర్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యే క దృష్టి సారించాలని, 40 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పీఆర్ ఈఈ నర్సింహులు అన్నారు. గురువారం కాళ్ళకల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటి వద్ద చదువుకునేలా పర్యవేక్షించాలన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నర్సింహులు

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా స్వయం పాలన**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు నక్షత్ర, పూజిత, చందన, మల్లీశ్వరి, లక్ష్మీబాయి, నందిని, సుశ్మిత, శివానీ, భార్గవి టీచర్లుగా వ్యవహరించారు.

◆ **నూతన తహసీల్దార్‌ను కలిసిన నాయకులు**

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో మండల బీజేపీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్ చారి, జిల్లా యువమోర్చ కార్యదర్శి అజయ్‌కుమార్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ **విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి**

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని మూసాపేటలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మొగులాన్ శ్రీనివాస్‌కు చెందిన పాడిగేద మిట్టపల్లి లక్ష్మీ పొలంలో మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మృత్యువాతపడింది. గేద విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

◆ **కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం చేయాలి**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు గురువారం తహసిల్దార్ గ్రేసిబాయికి వినతి పత్రం సమర్పించారు. కల్యాణలక్ష్మి పథకం చెక్కులు మంజూరయ్యాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా పెద్దశంకరంపేట, తిరుమలాపూర్ శివారులోని సర్వే నంబర్లు 1, 237, 238, 254లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి నుంచి భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

◆ **ఉచిత విద్య, వైద్యం కోసం సైకిల్ యాత్ర**

మనోహరాబాద్(తూప్రాన్): ఉచిత విద్య, వైద్యం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరుతూ కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామ యువకుడు బెల్లపు కరుణాకర్ సైకిల్ యాత్ర చేపట్టారు. గురువారం కూచారం గ్రామానికి చేరుకోగా ఆయనకు నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్యం, విద్య అందాలని, పారిశుద్ధ్యం బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు. ఇందుకు హైదరాబాద్ ధర్నా చౌక్ నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వరకు 1700 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

◆ **క్యాలెండర్ ఆవిష్కరణ**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని రుషి పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సత్యనారాయణ, సుష్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్**

చేగుంట(తూప్రాన్): చేగుంటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణవేణి పాఠశాల వీధిలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు అనిల్ సూచించారు.

◆ **బస్సుల కోసం విద్యార్థుల పరుగు**

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాలలు, గురుకులాలకు ప్రభుత్వం సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం మండలంలోని తునికి వద్దగల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు తునికి బస్టాండ్‌కు వచ్చారు. మెదక్ వెళ్లే ఆర్టీసీ బస్సు స్టేజివద్ద ఆపకుండా ముందుకు వెళ్లడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరుగులు పెట్టారు.

◆ **అయోధ్య అక్షింతల పంపిణీ**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గోమారంలోని శివాలయంలో పూజలు చేసిన అనంతరం ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, అయోధ్య రామశర్మ, బోనాల కృష్ణ, అభిలాష్, వెంకట్‌రెడ్డి, భక్తులు తదితరులు ఉన్నారు.